# రమణ భాస్కర

21

## (తునిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 5-12-95)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు అరుణాచల దీపోత్సవము. అరుణాచలమునకు జ్ఞానాచలం అని ఒక పేరు ఉంది. అంటే జ్ఞానమును ప్రసాదించే క్షేత్రము. ఆ ఊరు పేరు అరుణాచలం, అక్కడ ఉన్న కొండ పేరు అరుణాచలం, అక్కడ ఉన్న దేవుని పేరు అరుణాచలం. గాలి, నీరు, అగ్ని, ఆకాశము, భూమి వీటిని పంచభూతములు అంటారు. పంచభూతములకు పంచ శివలింగములు ఉన్నాయి. కాళహస్తిలో ఉన్నది వాయులింగము, కంచిలో ఉన్నది పృధ్వీలింగము,అరుణాచలంలో ఉన్నది అగ్ని లింగము, జంబుకేశ్వరంలో ఉన్నది జలలింగము, చిదంబరములో ఉన్నది ఆకాశలింగము. దేహములో గుండె ఏ స్థానంలో ఉందో ఈ భూమికి అరుణాచలం ఆ స్థానంలో ఉంది అని స్కాందపురాణంలో వ్యాసుడు చెప్పాడు. మనం ఎక్కడ ఉన్నా అరుణాచలంతో మానసిక అనుబంధము పెట్టుకొని ఆ కొండను ధ్యానం చేస్తూ ఉంటే మోక్షం వస్తుందని వ్యాసుడు స్కాందపురాణంలో చెప్పాడు.

అరుణాచలమును స్మరిస్తేనే మోక్షం వస్తుందని చెపుతున్నారు. ఎంతో కష్టపడితేనే మోక్షం రావటం లేదు. మోక్షం అంటే అంత తేలికగా ఉందా ఇక్కడ కూర్చుని స్మరిస్తేనే రావటానికి అని ఒక ప్లీడరుగారు భగవాన్‌ను అడిగారు. అరుణాచలమును స్మరిస్తేనే మోక్షం ఇస్తానని ఈశ్వరుడు చెపుతున్నాడు ప్రశ్నించటానికి నువ్వు ఎవడవు అన్నారు.

ఈశ్వరుడు అంటే నియమించేవాడు. ఆయన మన హృదయంలోనే ఉన్నాడు. కొంతమంది పొడవుగా, కొంతమంది పొట్టిగా ఉండవచ్చు. రంగులు తేడా ఉండవచ్చు. ఇవి అన్నీ ఉపాధులలో తేడా. లోపల ఉన్న పరమేశ్వరుడు అందరిలోనూ సమానంగానే ఉన్నాడు. మన దేహప్రారబ్ధము ప్రకారము మన జీవితమును నడుపుతూ ఉంటాడు. అనుకొనేది మన సంకల్పము. జరిగేది ఈశ్వర సంకల్పము. ప్రతి మనిషిని అంటే చదువు ఉన్నవాడిని, చదువులేని వాడిని, ధనం ఉన్నవాడిని, ధనం లేనివాడిని ఏదో రకమైన దుఃఖము వెంటాడుతూ ఉంటుంది. ఈ సృష్టి అంతా ఈశ్వర సంకల్పము ప్రకారము నడుస్తోంది అన్న విషయము అర్థమయితే ఇంక దుఃఖము పుట్టదు. ఈ వాక్యము నోటితో చెపుతున్నాము గాని మనకు అనుభవంలో లేదు.

బ్రహ్మ, విష్ణువులకు నేను గొప్ప, నేను గొప్ప అని వివాదం వచ్చింది. అది తీర్చటానికి ఈశ్వరుడు జ్యోతి స్థంబం రూపములో వెలిసాడు. నా మొదలును, చివరను ఎవరు చూసి ముందు వస్తారో వారు అధికులు అని చెప్పాడు. బ్రహ్మదేవునికి, విష్ణుదేవునికి మొదలు, చివర అందలేదు. ఇక్కడ కధ ముఖ్యము కాదు. బ్రహ్మదేవునికి, విష్ణుదేవునికి మొదలు, చివర అందలేదు అంటే మన హృదయంలో ఉన్న భగవంతుడు మన మాటకు, మనస్సుకు అందడు అని అర్థము. ఆయన మన ఇంద్రియాలకు అందడు. మన ఇంద్రియాలకు అందనంత మాత్రముచేత దేవుడు లేడు అని అనుకోకూడదు. అది మూర్ఖత్వము.

భగవంతుడు మనలాగ ఆడంబరముగా ఉండడు. మనలాగ స్థూలబుద్ధితో ఉండడు. చాలా సూక్ష్మంగా ఉంటాడు. అందరి హృదయాలలోనూ ఉంటాడు. సూక్ష్మంగా ఉంటాడు కాబట్టి మన కళ్ళకు కనబడడు. కళ్ళకు కనబడటం లేదు కాబట్టి లేడు అనుకొంటున్నాము. ఇదే మాయ.

బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు జ్యోతి స్థంబం యొక్క మొదలు, చివర చూడలేకపోయారు. అప్పుడు వారు ఇద్దరూ మేము ఆరాధించుకోవాలి నీవు రూపం ధరించాలి అంటే జ్యోతి స్వరూపమును ఉపసంహరించి, ఉపసంహరించి కొండరూపము ధరించాడు. ఇంత కొండను ఎలా పూజించగలము అని విష్ణువు అంటే అప్పుడు లింగరూపము ధరించాడు. తొలిలింగము, ఆధిలింగము అరుణాచలము. లింగం అంటే గుర్తు అని అర్థము. లింగం అంటే దేవుడు ఉన్నాడు అని గుర్తుకోసం. లింగానికి కాళ్ళు, చేతులు ఉండవు. అలాగని అసలు ఆకారము లేకుండా ఉందా అంటే ఆకారము కనిపిస్తూ ఉంటుంది. లింగాన్ని ఆరాధించినపుడు మనం చేసే జపం, మనం చేసే పూజ దేవునికి అందుతాయి. రాయిని పూజ చేసేటప్పుడు రాయి అని పూజించము. దేవుడు అని పూజిస్తాము. ఒకటి మర్చిపోవద్దు. మన భావనకు కూడా శక్తి ఉంటుంది. దీనిని భావనాబలం అంటారు. మీరు అందరూ బాగుపడాలి అని నేను భావన చేస్తున్నాను అనుకోండి నా భావనాబలం మీమీద పనిచేస్తుంది.

జన్మాంతరములో అనుబంధము లేనపుడు మీమీద నాకుగాని, నా మీద మీకుగాని ప్రేమ కలుగదు అని కాళిదాసు చెప్పాడు. అరుణాచలమునకు, రమణ మహర్షికి జన్మాంతరములో ఏదో సంబంధము ఉంది. బంధువుద్వారా అరుణాచలం పేరు విన్నప్పుడు అరుణాచలం అంటే ఊరు అని అనుకోలేదు అరుణాచలం అంటే దేవుడు అనే స్ఫురణ కలిగింది. ఆయనకు అరుణాచలంతో ఉన్న జన్మాంతర అనుబంధము అది. అరుణాచలం పేరు విన్న ఆరువారాలకు ఆయనకు మరణానుభవం కలిగింది. ఆయన ఏమీ సాధనలు చేయలేదు, తపస్సులు చేయలేదు. బ్రహ్మం అంటే ఏమిటో తెలియకుండా బ్రహ్మానుభవం పొందినవాడు ఒక్క రమణ మహర్షి తప్ప ప్రపంచ చరిత్రలో ఎవరూ లేరు అని రాధాకృష్ణన్ చెప్పారు.

రమణమహర్షిగారికి 16వ సంవత్సరములోనే మరణానుభవం కలిగింది. అంటే ఆయన శరీరము చనిపోయింది. శరీరము చనిపోయినా లోపల చనిపోకుండా ఒకడు ఉన్నాడు. వాడు నేను అని నాకు తెలుస్తోంది. ఈ శరీరమును స్మశానమునకు తీసుకొని వెళ్లి దహనం చేస్తారు. నేను మాత్రం బ్రతికే ఉన్నాను అనుకొన్నాడు. శరీరంలోపల చావులేని వస్తువు ఒకటి ఉంది. శరీరం చనిపోయినా అది చావదు. ఆ చావులేని వస్తువు ఆయనకు అనుభవంలోనికి వచ్చింది. 16వ సంవత్సరములోనే ఎవరి సహాయం లేకుండా ఆయన జ్ఞాని అయ్యాడు.

ఇప్పుడు మన శరీరము అహంకారము చేతులలో ఉంది. మనకు జ్ఞానం వచ్చాక భగవంతుడు మన శరీరమును పుచ్చేసుకొంటాడు. ఎందుకంటే ఆ శరీరము ద్వారా ఆయన పని చేసుకొంటాడు. రమణమహర్షిగారి శరీరము మధురైలో ఉండటం అరుణాచలేశ్వరుడికి ఇష్టంలేదు. అరుణాచలం రమ్మన్నాడు. 1896వ సంవత్సరం సెప్టెంబరు నెల 1వ తేదీన ఆయన అరుణాచలం వచ్చాడు. గుడిలోనికి వెళ్ళి అరుణాచలేశ్వరుడిని దర్శనం చేసుకొని ఒక మాట చెప్పాడు. అప్పా నీవు రమ్మంటే నేను వచ్చాను అన్నాడు. నాకు భక్తిని ప్రసాదించు, నాకు జ్ఞానమును ప్రసాదించు అని అడగలేదు. అప్పటికే ఆయన జ్ఞానసింహాసనంమీద కూర్చున్నాడు. ఆయన అరుణాచలం గుడిలోనికి ఒక్కసారే వెళ్ళాడు. ఆయనకు హృదయంలో ఉన్న వస్తువు తెలుస్తోంది కాబట్టి ఆయనకు తిరగవలసిన పనిలేదు. కాని మనం రోజూ వెళ్ళాలి. లేకపోతే దేవుడు గుర్తుకు రాడు. మనకు దేహబుద్ధి ఉన్నంత కాలము గుడికి వెళ్ళి దేవునికి నమస్కారం చేసుకొని రావటం మంచిది.

బిక్షకు వెళ్ళేటప్పుడు మేము రమణమహర్షి భక్తులము అని తెలియటానికి ఏదైనా వ్రాసి ఇవ్వండి అని కొంతమంది భక్తులు అడిగితే ఆయన అక్షరమణమాల వ్రాసారు. ఈ అక్షరమణమాల మనకు చాలాకాలం అన్నంపెట్టింది అని రమణమహర్షిగారు అంటూ ఉండేవారు. అక్షరమణమాల అంటే అక్షరములతో చేసిన పెండ్లినాటిమాల అని అర్థము. అక్షరములతో తయారు చేసే ఈ పెండ్లినాటిమాలను పూర్తి అయ్యేటట్లు అనుగ్రహించు అని ముందుగా వినాయకుడ్ని ప్రార్థించారు. ఇక్కడ అరుణాచలేశ్వరుడు పెండ్లి కుమారుడు, రమణమహర్షి పెండ్లి కుమార్తె. మన ఇద్దరికి పువ్వుల గొడవవద్దు. నేను అక్షరాలతో తయారుచేసిన దండను నీ మెడలో

వేస్తాను. నువ్వు ఏమి చేస్తావు అంటే నీ అనుగ్రహంతో చేసిన దండను నా మెడలో వేసి ఆశీర్వదించు అని అరుణాచలేశ్వరుడిని రమణమహర్షిగారు అడిగారు.

తినటానికి తిండి, కట్టుకోవడానికి బట్ట ఉన్నంత మాత్రముచేత మనం సుఖంగా ఉండలేము. ఆనందము, సుఖము, శాంతి భగవంతుడిలో ఉన్నాయి. భగవదనుభవం మనం పొందినపుడు ఆ సుఖము, శాంతి, ఆనందము మనకు తెలుస్తాయి. నిజమైన అరుణాచలం మన హృదయంలోనే ఉంది. అది మనకు అనుభవంలోనికి రాకుండా మన అహంకారము అడ్డువస్తోంది. అది తెలుసుకొనేవరకూ మనకు సుఖం లేదు. భగవంతునికి సంబంధించిన సుఖము, శాంతి ఈ జీవితంలో కొన్ని క్షణాలు రుచి చూస్తే ఇంక అది మనం విడిచిపెట్టము. అదే పట్టుకొని వ్రేలాడుతాము. ఆ రుచిని ఒక్కసారి చూస్తే ఆ రుచిని బట్టి భగవంతుని తెలుసుకోవడానికి జీవుడు ప్రయత్నం చేస్తాడు.

అరుణాచలశివ, అరుణాచలశివ, అరుణాచలశివ, అరుణాచలా అని ఎవడైతే అరుణాచల శివుడిని స్మరిస్తున్నాడో, ధ్యానిస్తున్నాడో వాడి అహంకారమును కాల్చి బూడిద చేస్తాడు. నిజమైన అరుణాచల శివుడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఆయనను మనం ధ్యానంచేయటం వలన ఆయన అనుభవంలోనికి రాకుండా మన అహంభావనే అడ్డువస్తోంది కాబట్టి అహంభావనను వేరుతో సహా బయటకు తీసి కాల్చి బూడిద చేస్తాడు.

Teen age Worst age అని చెపుతారు. అటువంటి వయస్సులో రమణమహర్షికి జ్ఞానం వచ్చేసింది. నేను అహంభావన అనే గూటిలో పడి ఉన్నాను. దానికోసమే బ్రతుకుచున్నాను. నా అహంభావననుండి తొలగించమని నేను ఏమీ ప్రార్ధన చేయలేదు. నాకు తెలియకుండానే నాలో ప్రవేశించి నా అహంభావననుండి నన్ను తొలగిరించావు. నా అహంకారము అనే గుహనుండి బయటకు లాగి నీ హృదయ గుహలో పడేసావు. ఈ పని చేసేటప్పుడు నాకు కొంచెము కూడా నొప్పిలేకుండా చేసేసావు. సాధారణంగా మానవుడు కృషిచేస్తాడు, దేవుడు కృప ఇస్తాడు. కాని నావిషయంలో నా కృషి లేకుండా నీ కృప ఇచ్చేసావు. ఏమీ బాధ లేకుండానే అజ్ఞానమును తొలగించి నీ జ్ఞానమును నాకు ప్రసాదించావు అరుణాచలా. ఈ ప్రక్రియ చేసేటప్పుడు ఆడంబరము లేదు, గొడవలేదు. ఎవరికీ తెలియకుండా, నాకు కూడా తెలియకుండా దొంగచాటుగా ఈ పని చేసుకొని వెళ్లిపోయావు అరుణాచలా అని రమణమహర్షిగారు అన్నారు. నీవు ఎవడివో నాకు తెలియదు. నాకు అరుణాచలంను స్మరించాలనే బుద్ధి కూడా లేదు. అరుణాచలమును స్మరించేలానీవే చేసావు. ఆ బుద్దిని కలుగజేసిన వాడవు నువ్వే, మోక్షమును ఇచ్చినవాడవు నువ్వే.

నీవు కొండ రూపంలో కనిపిస్తున్నావు. కాని నీవు జ్ఞానసముద్రుడవే, కరుణాసముద్రుడవే. ఇప్పుడు నన్ను అహంకారమ rule చేస్తోంది. దానిని ప్రక్కకు తొలగించి దానిస్థానంలో నీవు కూర్చో. నాకు అహంకారము rulerగా ఉండకూడదు. నాకు rulerగా జ్ఞానమే ఉండాలి. అని రమణమహర్షి అనే పెండ్లికుమార్తె అరుణాచలేశ్వరుడు అనే పెండ్లికుమారుడనుప్రార్ధిస్తోంది.

ఉన్నది ఒకటే వస్తువు. మనకు భిన్నంగా కనిపిస్తోంది. ఇదే మాయ. చిదంబర రహస్యం ఎప్పుడైనా చూసారా. అక్కడ ఏమీ ఉండదు. అంటే ఏమీ లేకపోవటమే చిదంబర రహస్యము. అంటే నీ మనస్సు కల్పించినది ఏమీ అక్కడ ఉండదు. చిదంబర రహస్యం అంటే ఏమీ లేదు అని అర్థం. అంటే దేవుడు లేడు అని కాదు. నువ్వు అనుకొన్నది ఏదీ లేదు అని చెప్పటం. మనం ఏదో ఉంది, ఏదో ఉంది అనుకొంటాము. మనం ఉంది అనుకొన్నది అంతా మన మనోకల్పితము. అంటే జీవుని కల్పితము. నిజం అనేది ఒకటిగానే ఉంటుంది. అజ్ఞానం అనేకంగా ఉంటుంది గాని జ్ఞానం ఒకటిగానే ఉంటుంది. నీ మనస్సు ఒకలాగ ఉంటుంది, నా మనస్సు ఒకలాగ ఉంటుంది. ఇలా మనస్సులు రకరకాలుగా ఉంటాయి. కా ని ఈ మనస్సులన్నింటికి ఆధారముగా ఉన్నదేవుడు మాత్రం ఒకటిగానే ఉంటాడు.

దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడికి, దేవుడు లేడు అని చెప్పేవాడికి పెద్ద తేడా ఏమీ లేదు. దేవుడు లేడు అని చెప్పేవాడికి ఎలాగూ దేవుని గురించి తెలియదు. దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడు కూడా నోటితో చెపుతున్నాడు గాని వాడికి అది అనుభవంలోలేదు. వాడికీ తెలియదు వీడికీ తెలియదు. ఇద్దరూ సమానమే. ఉన్నది ఒక్కటే వస్తువు మిగిలినవన్నీ మనస్సుయొక్క కల్పితములు.

మనకు నేను అనే తలంపు ఉంది. అది మనలోపలనుండి వస్తోంది. మనలోపల ఆధ్యాత్మిక హృదయం ఒకటి ఉంది. అక్కడనుండే ఈ నేను అనే తలంపు వస్తోంది. ఈ నేనును విచారణ చేసినా నీకు దేవుడు తెలియబడతాడు అని భాగవతంలో ఉంది. దీని గురించి రమణమహర్షిగారు వివరంగా చెప్పారు.

చెరువు దగ్గరకు వెళ్ళినపుడు నీటిలోనికి చూస్తే సూర్యుడు కనబడతాడు. చెరువులో కనబడిన సూర్యుడు నిజమైన సూర్యుడా కాదు అబద్ధమైన సూర్యుడు. అది ప్రతిబింబము మాత్రమే. ఇక్కడ కనిపిస్తున్నాడు ఏమిటి అని మొఖం పైకి పెట్టి చూస్తే నిజమైన సూర్యుడు మనకు కనబడతాడు. అంటే అబద్ధమైన సూర్యుడు నిజమైన సూర్యుడను చూడటానికి సహకరించాడు. అలాగే నేను అనే తలంపు నిజంకాదు. అది అబద్ధమే. ఈ నేను అనే తలంపును విచారణ చేస్తే అది ఎక్కడయితే పుట్టిందో అక్కడకు వెళ్ళిపోతుంది. అక్కడే దేవుడు ఉన్నాడు. అప్పుడు దేవుడు నీకు తెలియబడతాడు. అదే నిజమైన ఇల్లు. ఆ ఇంటికి ఎవడైతే వెళ్ళాడో వాడు ఇంక శవాలను మోయనక్కరలేదు.

దేహానికి చేసే చాకిరి అంతా ఇంతా కాదు అన్నారు భగవాన్. రోజూ దానికి అన్నం పెట్టడం, స్నానం చేయించటం, రోగం వస్తే డాక్టరు దగ్గరకు తిప్పటం, పైగా సరదాలు ఇలా ఎంతో చాకిరీ చేస్తాము. చనిపోయేవరకూ దీనికి చాకిరి చేయవలసిందే. ఈ దేహమునకు చేసే చాకిరీలో సగం మీరు ప్రయత్నం చేసినా మీకు దేవుడు తెలియబడతాడు.

మా అమ్మ అళగమ్మ, మా నాన్న సుందరమయ్యర్ ఎంత ఐకమత్యంగా జీవించారో అలాగే నువ్వు, నేను కలిసి ఉందాము అరుణాచలా అని ఒక ద్విపదలో భగవాన్ చెప్పారు.

ప్రకృతిలో అన్ని ప్రేమలకంటే తల్లి ప్రేమ గొప్పది. కాని ఓ అరుణాచలేశ్వరుడా! నీవు నాపట్ల చూపించిన ప్రేమముందు తల్లి ప్రేమ సరిపోదు అని చెప్పారు. నీవు గొప్ప ప్రేమ గలవాడవు, దయగలవాడవు. నీ ప్రేమను మాటలతో వర్ణించలేము, చేతులతో వ్రాయలేము. ఎవడి హృదయానికి వాడికే తెలియాలి.

మనకు తెలివి అవసరమే, హృదయం అవసరమే. మనకు ఉన్న తెలివితేటలను హృదయంలో ఉన్న దేవుని తెలుసుకోవటానికి ఉపయోగించుకోవాలి. తెలివితేటలు లేకపోవటంకంటే తెలివితేటలు ఉండటం మంచిది. ఆ తెలివితేటలతో నీ హృదయంలో ఉన్న పరమేశ్వరుని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. భగవంతుడు ఏదైనా శక్తిని ఇస్తే దానిని సద్వినియోగం చేసుకో. దాని వలన పుణ్యం వస్తుంది. పుణ్యం జ్ఞానం సంపాదించుకోవటానికి సహకరిస్తుంది.

ప్రత్యక్షముగా ఉన్న వస్తువును అప్రత్యక్షము చేసుకొని దేవుడు లేడు అంటే ఎవరు ఏమి చెపుతారు అని రమణమహర్షిగారు తరచుగా అనేవారు. వస్తువు ప్రత్యక్షముగా ఉంది. నీ దురలవాట్లవలన దానిని అప్రత్యక్షము చేసుకొంటున్నావు. అప్రత్యక్షము చేసుకొని దేవుడు లేడు అంటే ఎవరు ఏమి చెపుతారు. ఆరోగ్యసూత్రాలను పాటించకుండా మాకు ఆరోగ్యంగాలేదు అంటే ఎవరు ఏమీ చెపుతారు. ఉన్నవస్తువును నీవు లేదు, లేదు అన్నంతమాత్రంచేత ఉన్నది లేకుండా పోదు. దేవుడు మన ఆలోచనలమీద, మన తలంపుల మీద ఆధారపడి లేడు. ఉన్నవాడు ఎప్పుడూ ఉంటాడు. నీవు ఉన్నాడు అనుకొన్నప్పుడూ, లేడు అనుకొన్నప్పుడూ కూడా ఆయన ఉంటాడు. ఉన్నవాడు ఎక్కడికీ వెళ్ళడు.నీకు కోపంవచ్చినంత్రంచేత ఎక్కడికీ వెళ్ళడు. ఆయన సాక్షీమాత్రుడు.

సూర్యుడిని చూడటానికి దీపం అక్కరలేదు. మనం మొఖం అటు త్రిప్పితే సరిపోతుంది. నీ హృదయంలో దేవుడు ఉన్నాడు. నీ మొఖంను అహంకారమువైపుకు కాకుండా అటు త్రిప్పితే దేవుడు తెలుస్తాడు. సూర్యుడిలో చీకటిలేదు, ఆత్మలో అజ్ఞానము లేదు అని ఆచార్యులవారు చెప్పారు. ఇంక అజ్ఞానము ఎక్కడ ఉంది? నీ మనస్సులో ఉంది. పూర్వజన్మ బంధాలు, కొన్నివేల జన్మలు ఎత్తటానికి కావలసిన సామగ్రి అంతా నీ మనస్సులో ఉంది. అది అంతా దేవుని దగ్గర జాగ్రత్త పెట్టలేదు. అది అంతా నీ మనస్సులోనే ఉంది. మనస్సు ఉన్నవాడికి మాయ. మనస్సు లేకపోతే మాయలేదు, మనస్సు లేకపోతే అజ్ఞానము లేదు. మనస్సు లేకపోతే పునర్జన్మ లేదు.

ఎవరైతే అరుణాచలా, అరుణాచలా అని స్మరిస్తున్నారో వారి అహంకారము క్రమంగా తొలగించబడుతుంది. నా అహంకారమును నిర్మూలించు అని ప్రత్యేకంగా అడుగనక్కరలేదు. కాలుజారి నీటిలో పడతాము అనుకోండి, నన్ను తడుపు అని నీటిని అడగనక్కరలేదు. అదే తడిపేస్తుంది. అరుణాచలం జీవకోటి యొక్క అహంకారమును తొలగించటానికి వెలసిన క్షేత్రం కాబట్టి దానిని నా అహంకారము తొలగించు అని నీవు ప్రత్యేకంగా అడుగనక్కరలేదు.

మనస్సును కుదురుగా ఉండమని అందరూ చెపుతారు. దానిని కుదురుగా ఉండమని చెప్పటానికి నానా తంటాలు పడతారు. నేను పూజచేసి, జపం చేసి నా మనస్సును నిలబెట్టి ఉంచడానికి చూస్తున్నాను. అది నన్ను మాయచేసి బయటకు పోతోంది. అది నిన్ను కూడా మాయ చేసేలా ఉంది. ఓ అరుణాచలేశ్వరుడా! ఈ మనస్సు నన్ను ఎలాగూ మాయ చేస్తోంది. నిన్ను కూడా మాయ చేసేలా ఉంది. నిన్ను మాయచేయకుండా ఉండాలంటే నీవు వచ్చి నా మనస్సుమీద కూర్చో అని రమణస్వామి చెపుతున్నాడు. అప్పుడు ఇంక నిన్ను మాయచేసి తప్పించుకోవటానికి దానికి వీలులేదు. అందువలన నా మనస్సుమీద స్థిరంగా కూర్చో. అది అణిగిపోయేవరకూ కూర్చో. ఎంతసేపు కూర్చోవాలి అంటే అది పూర్తిగా నాశనం అయ్యేవరకూ కూర్చో. దానికి ఏమాత్రం ప్రాణం ఉన్నా నీవు లెగిసిపోతావు అనుకో దాని ప్రయాణం అది చేసేస్తుంది. శేషము లేకుండా అంటే నిశ్శేషముగా మనస్సు నశించాలి. కొద్దిగా శేషం మిగిలింది అనుకో అది మరల జన్మను తీసుకొని వచ్చేస్తుంది. అందువలన మనస్సు పూర్తిగా నాశనం అయ్యేవరకూ స్థిరంగా నా మనస్సుమీద కూర్చోమని రమణమహర్షి అనే పెండ్లికుమార్తె అరుణాచలేశ్వరుడు అనే పెండ్లికుమారుడను ప్రార్థిస్తోంది.

కరెంటు ఉన్నా బల్బు లేకపోతే ప్రకాశము మనకు రాదు. మన మనస్సులో ఉన్నగుణాలు వ్యక్తమవ్వటానికి ఒకదేహము ఉండాలి. అందువలన జీవలక్షణాలు ఉంటే దేహమువచ్చేస్తుంది. దేహంద్వారానే జీవలక్షణాలు వ్యక్తమవుతూ ఉంటాయి. శరీరము చనిపోకముందే జీవలక్షణాలు నాశనం అయితే ఇంక కొత్త శరీరమురాదు. దేహబుద్ధి ఉన్నంతకాలము చనిపోయినవాడు తిరిగి జన్మిస్తాడు. సంసారం అంటే ఇంటిలోని మనష్యులుకాదు. నీ అహంకారమే సంసారము అన్నారు భగవాన్. అహంకారము నశిస్తే సంసారము నశిస్తుంది.

ఇంటిలోని మనుష్యులను ద్వేషించనక్కరలేదు. నీ ప్రారబ్ధమునుబట్టి వారు సిద్ధం అవుతారు. మీ బంధువులుగాని, స్నేహితులుగాని మీ జ్ఞానమునకు అడ్డురావటంలేదు. మీ అహంభావనే అడ్డువస్తోంది. దానిని తొలగించుకొంటే మీకు జ్ఞానం కలుగుతుంది. నీకు నిజంగా భక్తి కుదిరితే సమస్త ఇంద్రియాలకు భగవంతుడేకనబడతాడు అని ఆచార్యులవారు చెప్పారు. ఎంత వైభవంగా ఉందో చూడండి.

లోకంలో అనేక రకాల ఆకర్షణలు ఉన్నాయి. ఏదో ఒక ఆకర్షణలో నేను కొట్టుకొనిపోతాను. ఏదో ఒక ఆకర్షణలో కొట్టుకొనిపోకముందే నీ మీద నాకు ఆకర్షణ కలిగించు. నీ మీద నాకు ప్రేమ కలిగించు. నీ మీద నాకు ఇష్టం కలుగకపోతే నీ సుఖం నా సొంతం ఎలా అవుతుంది అరుణాచలా! అందువలన ముందుగా నీయందు ప్రేమకలిగేటట్లు చేసి నీ సుఖాన్ని నాకు ఇచ్చివేయి. మనిషికి అంతకన్నా ఏమి కావాలి. హృదయంలో

ఉన్న ఆనందసముద్రము పొంగి నీ సహస్రారములోనికి వస్తే అప్పుడు దేవుడు కనబడినా చూడాలని అనిపించదు. అటువంటిది ఆనందసముద్రము. అది నీ హృదయంలోనే ఉంది. అది పొంగటానికి ఈశ్వరానుగ్రహం అవసరము. అందువలన నీ అనుగ్రహాన్ని నాకు ఇయ్యి అరుణాచలేశ్వరుడా! అని అడుగుతున్నాడు.

ఓ అరుణాచలేశ్వరుడా! పూర్వము అనేకమంది భక్తులు నీయొక్క ఔన్నత్యమును గొప్పగొప్పమాటలతో, కవిత్వంతో చెప్పారు. నాకు పాండిత్యం లేదు. చిన్న చిన్న మాటలతో స్తోత్రం చేస్తున్నాను. నాకు చేతకానిది నేను ఎలా చెయ్యగలను. నన్ను అనుగ్రహించి, దీవించు. ఎవడో ఒక రమణమహర్షిని ఉద్ధరించాను నా పని పూర్తి అయింది అని అనుకోవద్దు. ఎవరైతే నిన్ను ఆశ్రయిస్తున్నారో, నీ కరుణకోసం ఎదురు చూస్తున్నారో రమణమహర్షిని ఉద్ధరించినట్లుగా వారిని కూడా ఉద్ధరించు. నా శరీరము పోయినా ఫరవాలేదు. నీవు చిరకాలము ఉండు. నీవు స్థిరంగా ఉండు. ఎందుచేతనంటే నీవు అందరినీ ఆశీర్వదించి జ్ఞానులుగా చేయాలి. ఎవరికి ఏది చేసినా రహస్యంగా చేసే అలవాటు నీకు ఉంది. Silentగా చేసేస్తావు. ప్రక్కవాడికి తెలియనివ్వవు. కాని నేను ఒక పొరపాటు చేస్తున్నాను. నీవు Silentగా చేసే పనిని అందరికీ తెలియజెప్పేస్తున్నాను. అరుణాచలేశ్వరుడు చేసే పనిని రహస్యంగా చేస్తాడు అన్న విషయమును అందరికీ వ్యక్తం చేస్తున్నాను. వ్యక్తంచేయటంకూడా నీకు ఇష్టం ఉండదన్న సంగతి నాకు తెలుసు. నీకు ఇష్టంలేని పనిని చేస్తున్నందుకు నన్ను క్షమించి, ఆశీర్వదించు అరుణాచలేశ్వరుడా అని అడుగుతున్నాడు.

ఓ అరుణాచలేశ్వరుడా! డాక్టరునువ్వే, మందువూనువ్వే అంటున్నాడు. సాధారణంగా మనం డాక్టరు దగ్గరకు వెళితే ఆయన చూసి మందు వ్రాసి ఇస్తాడు. కాని ఇక్కడ నువ్వే డాక్టరు, నువ్వే మందు అంటున్నాడు రమణ మహర్షి. డాక్టరు చేసేపని నువ్వే చేయాలి, మందు చేసే పనికూడా నువ్వే చేయాలి అరుణాచలేశ్వరుడా అంటున్నాడు. నాలో ఏదైనా దోషము ఉంటే దానిని నువ్వే తొలగించాలి. ఆ దోషములను తొలగించి సుగుణాలతో నన్ను అలంకరించు. గుణము జ్ఞానముకాదు. కాని జ్ఞానమును సంపాదించటానికి గుణము ఉపయోగపడుతుంది. గుణము మనస్సులో ఉంది. జ్ఞానము ఆత్మలో ఉంది. మంచిగా ఉండమని పెద్దలు చెపుతారు. ఎందుకంటే మనలో ఉన్నమంచి భగవంతుని తెలుసుకోవటానికి సహకరిస్తుంది. చెడ్డగా ఉంటే చెడ్డమనలను పాడు చేస్తుంది.

నాకు బంధువులు లేరు, స్నేహితులు లేరు. నా అనేవారు ఎవరూ నాకు ఇక్కడ లేరు. నిన్ను నమ్మి ఇంతదూరము ఇక్కడకు వచ్చాను. వెనకాల స్నేహితుల సపోర్టు ఏమీ నాకు లేదు, అంగబలం లేదు, అర్థబలం లేదు. నువ్వే నాకు బలం. నువ్వే నాకు సపోర్టు, నువ్వే నాకు గతి అని అరుణాచలేశ్వరుడు అనే పెండ్లికుమారుడను రమణమహర్షి అనే పెండ్లి కుమార్తె శరణు వేడుతోంది. నీలో నన్ను ఐక్యం చేసుకోవుఅనుకో, నన్ను పొమ్మంటే ఇంకో దిక్కు ఏమీ నాకు లేదు. పొమ్మంటే నీ దగ్గర నశించిపోవాలి. ఇంతకన్నా వేరే దిక్కులేదు. నన్ను అనుగ్రహించి, ఆశీర్వదించు. నువ్వు తప్ప ఈ లోకంలో పొందదగినది అంటూ నాకు ఏమీలేదు అరుణాచలేశ్వరుడా. నువ్వే నాకు సాధన, నువ్వే నాకు గమ్యం అంటున్నాడు. మనం కడుపు నొప్పి వస్తే దేవుడా, దేవుడా అనుకొంటాము. అంటే దేవునిమీద ప్రేమకాదు, కడుపునొప్పి తగ్గడానికి అలా అనుకొంటాము. కాని ఇక్కడ రమణమహర్షి ఏమంటున్నారు అంటే నువ్వే సాధన, నువ్వే గమ్యం అంటున్నారు. భౌతికమైనవి ఏమీ నిన్ను అడుగవలసిన పని నాకు లేదు ఎందుచేతనంటే అవినాకు అక్కరలేదు. నువ్వే సాధన, నువ్వే గమ్యం ఓ అరుణాచలేశ్వరుడా! ఈ బిడ్డను ఆశీర్వదించవయ్యా, నీ అనుగ్రహం అనే దుప్పటితో నన్ను కప్పవయ్యా అని అరుణాచలేశ్వరుడు అనే పెండ్లికుమారుడను రమణ మహర్షి అనే పెండ్లి కుమార్తె ప్రార్థిస్తోంది. అక్షరమణమాలలో అన్ని రుచులు ఉన్నాయి. ఇందులో లేని రుచిలేదు. ఇందులో లేని రసం లేదు.

✤✤✤